క్లుప్తంగా

ఉద్యోగుల సేవలు అభినందనీయం



ఎంఈఓ విజయశ్రీ దంపతులను సన్మానించిన ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

మలికిపురం: అంకితభావంతో పని చేస్తున్న ఉద్యోగుల సేవలు అభినందనీయమని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ఇటీవల ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న మలికిపురం ఎంఈవో ఎం.విజయశ్రీని స్థానిక మండల రిసోర్స్ కార్యాలయంలో మండల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. సభలో ఎమ్మెల్యే రాపాక పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఉద్యోగులను ప్రభుత్వం తగిన విధంగా గుర్తించి వారికి అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ కొప్పిశెట్టి మంగతాయారు. మేడిచర్ల రాము, పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కంకటాల చంద్రశేఖర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎస్‌ఎస్‌ఎన్ఇ ప్రభాకర్, యేపుగంటి వెంకట పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీరామ సప్తాహం

ఆలమూరు: మండలంలోని చింతలూరులో నూతనంగా నిర్మించిన శెట్టిబలిజ రామాలయం వద్ద నిర్వహిస్తున్న తొలి శ్రీరామ సప్తాహం ఆదివారం వైభవంగా ముగిసింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భజన బృందాలు వారం రోజుల నుంచి భక్తి కీర్తనలను ఆలపించడంతో గ్రామం అంతటా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. రామాయణానికి సంబంధించి పలు ఘట్టాలకు చెందిన పద్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శ్రీరామ సప్తాహ మహోత్స ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం భారీ అన్నసమారాధన జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యాన సుమారు పది వేల మందికి పిండి వంటలతో నిర్వాహకులు అన్నదానం చేశారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి దేవతామూర్తులను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పలు ఆధ్మాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నూకాంబిక తీర్థంలో భక్తుల తాకిడి

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసియున్న నూకాంబిక అమ్మవారి తీర్థోత్సవాల్లో భక్తుల తాకిడి ఆదివారం విపరీతంగా ఉంది. తీర్థోత్సవాలు ప్రారంభమై పక్షం రోజులు కావస్తున్నా భక్తుల సంఖ్య మాత్రం తగ్గడం లేదు. ఆదివారం సెలవు కావడంతో సుదూర, పరిసరాల ప్రాంతాల నుంచి విచ్చేసిన వేలాది మంది భక్తులతో క్యూలన్నీ కిక్కిరిసిపోయాయి. అధికసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి తమ మొక్కులను తీర్చుకున్నారు. మహిళలు పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను అందజేశారు. చిన్నారులు, కాగడాలు వెలిగించారు. తీర్థంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలమూరు ఎస్సై ఎస్.శివ ప్రసాద్ నేతత్వంలో పోలీసులు బందోబస్తు కొనసాగిస్తున్నారు. గోశాల–గోపరంధామం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం భక్తుల దాహార్తిని తీరుస్తుంది.

భారీ అన్నసమారాధనలు

అంబాజీపేట: శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆదివారం మండలంలో భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. మాచవరం శివారు పెచ్చెట్టివారిపాలెంలో సీతారాముల ఆలయం వద్ద, కొర్లపాటివారిపాలెంలో కోదండ రామాలయం వద్ద, ఇసుకపూడి, చిరతపూడి, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, వాకలగరువు, తొండవరం, పసుపల్లి తదితర గ్రామాల్లో భారీ అన్నసమారాధనలు జరిపారు. అంతకు ముందు స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. పెచ్చెట్టివారిపాలెంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బొంతు పెదబాబు తదితరులు సీతారాములను దర్శించుకున్నారు.

జగన్మోహినీ కేశవస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక ఆలంకరణలో జగన్మోహినీ కేశవస్వామి

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన మండలంలోని ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో ఆదివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా జగన్మోహినీ కేశవస్వామికి సహస్ర నామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, నిత్యోపాసన, బలిహరణ, నీరాజన మంత్రపుష్పం, ప్రసాద వియోగం తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఈవో బి.కృష్ణ చైతన్య, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. ఆలయ ఈవో మాట్లాడుతూ సోమవారం మధ్యాహ్నం 5 గంటలకు సదస్యం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

అటెన్షన్

- నేటి నుంచి పరీక్షలు
- క్లస్టర్ పరిధిలో 9,890 మంది విద్యార్థులు

కొత్తపేట/అంబాజీపేట: ఉన్నత చదువులకు, ఉన్నతోద్యోగాలకు పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలే ప్రామాణికం. ఆ పరీక్షలకు ఏడాదిగా ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదివిన విద్యార్థులకు తమ ప్రతిభను చాటుకునే సమయం ఆసన్నమైంది. సోమవారం నుంచి జరిగే పరీక్షలు నిర్వహణకు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో 115 ప్రభుత్వ పాఠశాలల నుంచి 6,710 మంది విద్యార్థులు, 64 ప్రైవేట్ పాఠశాలల నుంచి 2,021 మందితో మొత్తం 179 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 8,733 మంది విద్యార్థులు, 1,209 మంది ప్రైవేట్ సప్లిమెంటరీ విద్యార్థులతో మొత్తం 9,890 మంది విద్యార్థులు పరీక్షలకు సిద్ధమయ్యారు.

180 పాఠశాలలు.. 9,910 మంది విద్యార్థులు

పి.గన్నవరం నియోజకవర్గంలో నాలుగు మండలాలో 62 హైస్కూళ్ల నుంచి 3,246 మంది, రాజోలు నియోజకవర్గంలో మూడు మండలాల్లో 55 హైస్కూళ్ల నుంచి 2790 మంది, కొత్తపేట నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 63 హైస్కూళ్ల నుంచి 3,854 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. ఆలమూరులో 3, ఆత్రేయపురంలో 3, కొత్తపేటలో 5, అయినవిల్లిలో 5, అంబాజీపేట 3, పి.గన్నవరంలో 6, మామిడికుదురు 6, రాజోలులో 5, మలికిపురంలో 7, సఖినేటిపల్లిలో 4 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షాల్లో ఎక్కడైనా మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే విద్యార్థులను డిబార్ చేయడంతో పాటు కాపీయింగ్‌కు పాల్పడిన విద్యార్థి గదిలోని ఇన్విజిలేటర్‌ను సస్పెండ్ చేయడంతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేస్తామని విద్యాశాఖ అధికారులు హెచ్చరించారు. పరీక్ష కేంద్రంలో అధికారులతో సహా ఎవరూ సెల్‌ఫోన్ వాడరాదని ఆదేశించారు.



తొండవరంలో పదో తరగతి పరీక్షలకు సూచనలిస్తున్న హెచ్ఎం మోకా ప్రకాష్

అన్ని సౌకర్యాలూ సమకూర్చాం



మండలంలోని టెన్త్ పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు సమకూర్చాం. బెంచీలు, బల్లలు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేశాం. మంచినీరు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు ఏర్పాటు చేశాం. పీహెచ్‌సీల ద్వారా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. 144వ సెక్షన్ అమల్లో ఉంటుంది. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కడ ఏ ఇబ్బంది ఏర్పడినా తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకున్నాం.

– ఎం.హరిప్రసాద్, ఎంఈఓ, కొత్తపేట

మానసిక ప్రశాంతతతో పరీక్షలు రాయాలి



విద్యార్థులు మానసిక ప్రశాంతతతో పరీక్షలు రాయాలి. సాధ్యమైనంత వరకూ మాంసాహారానికి దూరంగా ఉంటూ త్వరగా జీర్ణమయ్యే ఆరోగ్యకరమైన సాత్విక ఆహారాన్నే తీసుకోవాలి. రాత్రుళ్లు నిద్రమాని చదవడం వలన బద్ధకంతో ఉదయం పరీక్షలు రాయలేని పరిస్థితి ఏర్పడే అవకాశం వుంటుంది. కొంత విశ్రాంతి తీసుకుని చదివితే మానసిక ప్రశాంతత లభిస్తుంది.

– ఎం సుమలత, డివిజన్ వైద్యాధికారి, కొత్తపేట

సీఎంఆర్ఎఫ్‌తో ఆర్థిక భరోసా



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: నిరుపేదల వైద్య ఖర్చులకు సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఆర్థిక భరోసా కలుగుతుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే స్వగృహంలో లబ్ధిదారులకు ఆదివారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ అంబాజీపేటకు చెందిన సయ్యద్ గౌస్‌బేగంకు రూ.55 వేలు, పాత గన్నవరంకు చెందిన అడ్డగళ్ల రాధాకృష్ణకు రూ.50 వేలు, పి.గన్నవరంకు చెందిన యార్లగడ్డ రవీంద్రకు రూ.20 వేల చెక్కులను ఎమ్మెల్యే చిట్టిబాబు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, నాయకులు నక్కా వెంకటేశ్వరరావు, కుసుమ వరలక్ష్మి, సయ్యద్ వలీ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరికాయలు కొనుగోలు చేయాలి

మామిడికుదురు: మార్కెట్లో కొబ్బరి ధరలు దారుణంగా పతనమైన ప్రస్తుత పరిస్థితుల్లో నాఫెడ్ కేంద్రాల ద్వారా నేరుగా కొబ్బరికాయలు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మండల రైతు అధ్యక్షుడు యాలి శ్రీనివాస్ కోరారు. కొబ్బరి కొనుగోలు వల్ల ఏ మాత్రం ప్రయోజనం లేదన్నారు. కొబ్బరికాయల నుంచి వచ్చే కొబ్బరి దిగుబడి తయారీకి అయ్యే ఖర్చులు అంచనా వేసి కొబ్బరి కాయలకు కనీస మద్దతు ధర నిర్ణయించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.18,860 ధర నిర్ణయించిందని ఆ ప్రకారం కొబ్బరి కాయకు వచ్చే ధర రైతుకు ఏ మాత్రం గిట్టుబాటు కాదని శ్రీనివాస్ పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని కొబ్బరి కాయలకు మద్దతు ధర కల్పించి నేరుగా రైతుల వద్ద నుంచి నాఫెడ్‌ద్వారా కొబ్బరికాయలు కొనుగోలు చేయడం ద్వారా రైతులను ఆదుకోవాలన్నారు.

మిషన్ వాత్సల్యకు దరఖాస్తుల స్వీకరణ



అధికారి గజలక్ష్మి

ఆలమూరు: కేంద్ర ప్రభుత్వం అనాథ పిల్లలను ఆదుకునేందుకు ప్రవేశపెట్టిన మిషన్ వాత్సల్య పథకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కపిలేశ్వరపురం సీడీపీఓ అధికారి గజలక్ష్మి అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ వివిధ కారణల వల్ల మృతి చెందిన తల్లిదండ్రుల వల్ల అనాథలైన 18 సంవత్సరాల లోపు పిల్లల కోసం మిషన్ వాత్సల్య పథకం అమలు చేస్తుందన్నారు. ఎంపికైన అర్హుల పిల్లలకు ప్రతి నెలా ఈ పథకం కింద రూ.4000 వేలు పంపిణీ చేస్తారన్నారు. నిర్ణీత సమయంలో దరఖాస్తులు పూర్తి చేసి సీడీపీఓ కార్యాలయానికి అందజేయాలన్నారు. ఈ పథకానికి సంబంధించిన వివరాల కోసం సమీప అంగన్‌వాడీ కేంద్రాలను సంప్రదించాలన్నారు.

విమర్శలు లేని పాలన జగన్‌తోనే సాధ్యం



నల్లచెరువులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అయినవిల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో విమర్శలు లేని పాలనను అందిస్తున్నారని పి.గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. ఆదివారం మండలంలోని నల్లచెరువులో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా? వలంటీర్లు, స్థానిక అధికారులు సేవలు సక్రమంగా అందిస్తున్నారా లేదా? అని అడిగారు. ఏవరైన అవినీతికి పాల్పడితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలు విమర్శించేందుకు వీలులేని విధంగా సీఎం జగన్ పాలన కొనసాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం పాడైన గ్రామీణ రహదారులను, డ్రెయినేజీలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోతుందన్నారు. నవరత్నాల పేరిట ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, ఎంపీటీసీ సభ్యుడు రావూరి వెంకటరామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు శీలం వెంకటేశ్వరరావు, గుత్తుల నాగబాబు, వారా జయసావిత్రి, కుడుపూడి సత్యనారాయణ, వార లక్ష్మీనరసింహం, పితాని వెంకటేశ్వరరావు, మిండగుదిటి రాంబాబు, దాసరి నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యలింగేశ్వరుని కల్యాణం

మామిడికుదురు: పెదపట్నంలంకలో కొలువుదీరిన ఉమా సత్యలింగేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల కోలాహలం నడుమ సత్యలింగేశ్వరుని కల్యాణం కమనీయంగా నిర్వహించారు. పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన మంటపంలో ఉమాదేవితో సత్యలింగేశ్వరుని కొలువుదీర్చారు. బ్రహ్మశ్రీ ఆదిరాజు రఘునాథశర్మ, సూర్యకుమారి దంపతులు కర్తలుగా పాల్గొని సత్యలింగేశ్వరుని కల్యాణ ఘట్టాన్ని జరిపించారు. బి.దొడ్డవరంలో వేంచేసిన ఉమా సోమేశ్వరస్వామి కల్యాణం కూడా రమణీయంగా జరిగింది. ఆయా కల్యాణోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: కె.పెదపూడిలో వేంచేసిన పార్వతీ సమేత మేనకేశ్వర స్వామి, రుక్మిణీ సత్యభామా సమేత కృష్ణరాయుడు స్వామి వారి ఆలయంలో కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు కొత్తలంక బుజ్జి ఆధ్వర్యంలో స్వామికి నిత్య అగ్నిహోత్రం, బలిహరణ, పునః పూజలు చేశారు. శనివారం రాత్రి స్వామి వార్లకు కల్యాణాన్ని జరిపించారు. స్వామి వారి కల్యాణాన్ని భక్తులు అధికసంఖ్యలో పాల్గొని వీక్షించారు.

ముత్తైదువులకు పసుపు, కుంకుమ పంపిణీ



ముత్తైదువులకు పసుపు, కుంకుమ అందజేస్తున్న రాజా దంపతులు

మామిడికుదురు: ఆదుర్రు గ్రామదేవత సత్తెమ్మ తల్లి జాతరను పురస్కరించుకుని ఆదివారం రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా–రాజశ్రీ దంపతులు ముత్తైదువులకు పసుపు, కుంకుమ, గాజులు, రవికలు పంపిణీ చేశారు. అమ్మవారి జాతరలో భాగంగా అమ్మవారికి భక్తులు నైవేద్యాలు చెల్లించారు. దీనిలో భాగంగా రాజా దంపతులు అమ్మవారిని దర్శించుకుని భక్తులకు పసుపు, కుంకుమలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, నగరం ఏఎంసీ మాజీ చైర్మన్ జక్కంపూడి తాతాజీ, పార్టీ జక్కంపూడి ఏసు, జక్కంపూడి భాస్కర్, జక్కంపూడి వాసు, తోరం భాస్కర్, తోరం వీరభద్రరావు, వలవల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ సానుకూలంగా స్పందించారు

మామిడికుదురు: 216వ నంబర్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పాశర్లపూడిలో స్థలాలు కోల్పోతున్న తమకు సమన్యాయం చేయాలని కోరుతూ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను కలిసి విన్నవించామని పాశర్లపూడికి చెందిన బాధితులు తెలిపారు. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో బాధితులు తమ సమస్యలను వివరించారు. అమలాపురంలో జరిగిన సమావేశంలో మంత్రి విశ్వరూప్ తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లాకు సూచించారన్నారు. కొంత మంది బాధితులకు గజాల్లోను, మరి కొంతమందికి సెంట్ల రూపంలోను పరిహారం నిర్ణయించడం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని, ఇదే విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. అందరికీ ఒకే విధంగా గజాల లెక్కన పరిహారం చెల్లించాలని విశ్వరూప్ సూచించగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారన్నారు. దీంతో పాటు ఇళ్లు కోల్పోతున్న వారికి కూడా న్యాయం చేయాలని కోరామన్నారు. ఇళ్లు పాక్షికంగా నష్టపోతున్న వారికి పూర్తి పరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఈ విషయాన్ని కూడా మంత్రి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా ఆ రెండు అంశాలపై కూడా సానుకూల స్పందన వచ్చిందన్నారు. పైన పేర్కొన్న అంశాలపైనే తాము పోరాటం చేస్తున్నామని, వీటిపై సమగ్రంగా పరిశీలన చేసి తమకు న్యాయం చేసి తమను ఆదుకోవాలని బాధితులు కోరారు. మంత్రిని కలసిన వారిలో గంధం మాణిక్యం, బొక్కా రామకృష్ణ, వర్ధనపు లక్ష్మీకుమారి, గంధం వెంకటస్వామి నాయుడు, బొక్కా ప్రభాకరరావు, పాటి గంగా సత్యనారాయణ, గెద్దం గంగాధర్, వాకపల్లి శ్రీను, పాటి సత్యనారాయణ, బొక్కా త్రిమూర్తులు ఉన్నారు.

స్వామివారి సన్నిధిలో సబ్‌కలెక్టర్



అంతర్వేది ఆలయంలో సబ్‌కలెక్టర్ సూర్యతేజ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ కుటుంబ సమేతంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు వారికి ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు. అలాగే ఆలయంలో ఆదివారం సుమారు 6 వేల మంది భక్తులు స్వీకరించినట్టు దేవస్థానం తెలిపింది.

ఘనంగా శ్రీపుష్పోత్సవం



పట్టాభిరామస్వామి వారి శ్రీపుష్పోత్సవం

పి.గన్నవరం: స్థానిక పాత అక్విడెక్టు వద్ద వేంచేసిన పట్టాభి రామస్వామి వారి కల్యాణ మహోత్సవాలు ఆదివారం రాత్రి శ్రీవారి పుష్పోత్సవంతో ముగిశాయి. గత నెల 29న ఆలయ ధర్మకర్తలు పేరిచర్ల భీమరాజు, సత్యవాణి దంపతుల ఆధ్వర్యంలో అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం ఆలయ అర్చకులు వాడపల్లి రాంబాబు నేతృత్వంలో స్వామికి చక్రస్నానం, పూర్ణాహుతి తదితర పూజలు జరిగాయి. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయాలి



కొత్తపేటలో నియోజకవర్గ కన్వీనర్, కో కన్వీనర్లను సత్కరిస్తున్న పార్టీ రాష్ట్ర నాయకుడు పాలూరి

కొత్తపేట: నియోజకవర్గంలో బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు బూత్ కమిటీలు, శక్తి కేంద్రాలు నియమించాలని ఆ పార్టీ రాష్ట్ర స్వచ్ఛభారత్ కన్వీనర్ పాలూరి సత్యానందం నూతనంగా నియమితులైన పార్టీ అసెంబ్లీ కన్వీనర్, కో కన్వీనర్లకు సూచించారు. నియోజకవర్గ బీజేపీ కన్వీనర్‌గా ఆలమూరు మండలానికి చెందిన ఐనవెల్లి సత్తిబాబుగౌడ్, కో కన్వీనర్‌గా కొత్తపేట మండలానికి చెందిన కోటిపల్లి దామోదర్ నియమితులయ్యారు. వారు ఆదివారం పార్టీ శ్రేణులతో కలసి కొత్తపేటలో రాష్ట్ర పార్టీ నాయకుడు పాలూరి సత్యానందంను మర్యాదపూర్వకంగా కలసి సత్కరించారు. ప్రతిగా పాలూరి సత్తిబాబు, దామోదర్‌లను అభినందించి, శాలువాలతో సత్కరించారు. సత్యానందం మాట్లాడుతూ త్వరలో నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటించి, పార్టీ శ్రేణులతో సమావేశాలు చేసి రాబోయే ఎన్నికలకు సంసిద్ధులను చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పాలాటి మాధవస్వామి, జిల్లా కార్యదర్శి గొలకోటి వెంకటేశ్వరరావు, యువమోర్చా కాకినాడ జిల్లా ఇన్‌చార్జ్ పాలూరి జయప్రకాష్‌నారాయణ, కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు యు.ప్రసాద రాజు, జిల్లా కార్యవర్గ సభ్యుడు సీతారామిరెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు ఇళ్ల పల్లంశెట్టి, కార్యదర్శి దావీదు తదితరులు పాల్గొన్నారు.

జగన్మోహినీ కేశవస్వామి సన్నిధిలో దుర్గారావు



స్వామి చిత్రపటం అందజేస్తున్న ఈవో చైతన్య

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో ఆదివారం వేంకటేశ్వర భక్తి చానల్ సలహాదారు ఏఎస్ దుర్గారావు స్వామి వార్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో బి.కృష్ణ చైతన్య స్వామి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. అలాగే వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి ఆలయ నిర్మాత పినపోతు గజేంద్రుడు వారుసుడు లక్ష్మీనరసింహస్వామి వర్మ స్వామి వార్ని దర్శించుకున్నారు. స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆయన వెంట అగ్నికుల క్షత్రియులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

పి.గన్నవరం: మండలంలోని రాజులపాలెం గ్రామ శివారు అయినాలవారిపాలెంలో మండల పరిషత్ నిధులతో సీసీ రోడ్డు పనులను ఆదివారం ఎంపీపీ అంబటి భూలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొంబత్తుల ఏసుబాబు, మండల ఉపాధ్యక్షుడు నేలపూడి దామోదరం, నాయకులు నక్కా వీవీ సత్యనారాయణ, గుత్తుల దాసు, పేపకాయల శ్రీను, ఉయ్యూరి పృథ్వీరాజ్, బొమ్మిరెడ్డి పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



కొత్తపేటలో మట్టల ఆదివారం ర్యాలీ



అప్పనపల్లిలో మట్టల ఆదివారంలో పాల్గొన్న క్రైస్తవులు



శంకరగుప్తంలో మట్టల ఆదివారం ర్యాలీలో చిన్నారులు

మామిడికుదురు: ఈస్టర్ పండగకు ముందు వచ్చే ఆదివారాన్ని మట్టల ఆదివారంగా క్రైస్తవులు ఆనందంగా నిర్వహించుకుంటారు. క్రీస్తు యెరూషలెం పట్టణానికి ప్రవేశించే సందర్భాన్ని పురస్కరించుకుని ఈత మట్టలు గాలిలో ఊపుతూ ఏసుక్రీస్తును స్తుతిస్తారు. మండలంలోని పలు చర్చిల వద్ద క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని ఘనంగా జరుపుకొన్నారు. చర్చిల్లో క్రైస్తవులు పాటలు పాడి సందడి చేశారు. ఆయా గ్రామాల్లో జరిగిన వేడుకల్లో పాస్టర్ జి.జయకుమార్ పాల్గొన్నారు.

మలికిపురం: మట్టల ఆదివారం నేపథ్యంలో ఆదివారం మండలంలోని పలు క్రీస్తు చర్చిల వద్ద క్రైస్తవులు ఊరేగింపు నిర్వహించారు. ఈత మట్టలను అలంకరించి చిన్నారులు భక్తులు ర్యాలీ నిర్వహించారు. శంకరగుప్తంలో పాస్టర్ చెవ్వాకుల సంధ్య ఆధ్వర్యంలో విశ్వాసులు ర్యాలీ నిర్వహించారు. రామరాజులంక చర్చి పేట, గుడిమెళ్లంక, చింతలమోరి తదితర గ్రామాల్లో మట్టల ఆదివారం ర్యాలీలు జరిగాయి.

కొత్తపేట: మట్టల ఆదివారం కార్యక్రమాలు మండలంలో గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించారు. వివిధ క్రైస్తవ చర్చిల పాస్టర్స్, సంఘ పెద్దల ఆధ్వర్యంలో సండే స్కూలు బాలలు ఆనందోత్సాహాలతో మట్టలకు రంగు రంగుల పుష్పాలను అమర్చి వాటిని చేతపట్టి, క్రైస్తవ గీతాలను ఆలపిస్తూ ర్యాలీలు నిర్వహించారు. స్థానిక పినిపేవారిపేటలో 'ప్రవచన దేవుని సంఘం, యెరూషలెం చర్చ్' సంఘ కాపరి బిషప్ జి.అబెద్నగో ఆధ్వర్యంలో సండే స్కూలు బాలలు మట్టలు చేతపట్టి ఘనంగా ర్యాలీలు నిర్వహించారు. హోసన్నా జయ గీతాలు ఆలపిస్తూ, 'హోసన్నా జయము' నినాదాలతో దేవుని స్తుతించారు. అనంతరం దేవాలయానికి చేరుకుని మట్టల ఆదివారం ఆరాధన ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో బ్రదర్ ఎలివెన్ కుమార్, పెద్దలు, సండే స్కూల్ టీచర్స్ పాల్గొన్నారు. స్థానిక భారత్ బైబిల్ చర్చిలో రెవ వైఎస్ ప్రదీప్, జేమ్స్ ఫౌండేషన్ షోరోమ్ ప్రేయర్ టెంపుల్ పాస్టర్ బ్రదర్ రవిశాస్త్రి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు.

పి.గన్నవరం: మట్టల ఆదివారం కార్యక్రమాన్ని బెల్లంపూడి మత్తయి లూథరన్ చర్చిలో పాస్టర్ వి.దొరబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు పాటలను ఆలపించారు. పిల్లలు గ్రామంలో మట్టలతో ఊరేగింపు నిర్వహించారు.

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో క్రైస్తవులు మట్టల ఆదివారంను చేసుకున్నారు. ప్రభువైన క్రీస్తుకు శిలువ వేసే ముందు ఆదివారం రోజున ఆయన తొలిసారిగా జెరూసలేం ప్రవేశిస్తారు. అప్పటి నుంచి అపవిత్ర దినాన్ని మట్టల ఆదివారం పర్వదినంగా క్రైస్తవులు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. దేవుని పట్ల అత్యంత విశ్వాసంతో మట్టల ఆదివారం ముందు 40 రోజులు క్రైస్తవులు శ్రమ దినాలు పాటిస్తారు. అందులో భాగంగా క్రైస్తవులు ఈతమట్టలు చేతబూని గ్రామ, పుర వీధుల్లో బారీ ర్యాలీలు నిర్వహించారు.

కొంచెం ఎండ... కొంచెం మబ్బు..



నిర్మానుష్యంగా పుల్లేటికుర్రు ప్రధాన రహదారి

అంబాజీపేట: గత కొద్ది రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతుండగా... ఒక్కసారిగా వాతావరణంలో ఆకస్మికంగా మార్పులు చోటు చేసుకోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొంచెం ఎండ.. ఆ మరుక్షణమే కొంచెం కారు మబ్బులతో చల్లగాలులు వీచడం వెంటనే ఉష్ణోగ్రతలు పెరిగి ఉక్కపోయడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు మండలాల్లోని పరిసర ప్రాంతాల్లో గరిష్టంగా 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అయితే రాత్రి సమయాల్లో మాత్రం ఉష్ణోగ్రతలు అమాంతం పడిపోతున్నాయి. వాతావరణంలో భిన్న మార్పుల కారణంగా ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఒక్కసారిగా వాతావరణ మార్పుల వల్ల ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఈ పరిస్థితుల్లో ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

మామిడికుదురు: గోగన్నమఠంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ అశోక్‌వర్మ భూపతిరాజు 100 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందజేశారు. బీపీ, సుగర్, థైరాయిడ్, గుండె, కిడ్నీ, నరాలు, ఊపిరితిత్తులు, లివర్ తదితర వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. ప్రతి నెలా మొదటి ఆదివారం ఉచితంగా రోగులకు సేవలందిస్తామని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అశోక్‌వర్మ పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ భూపతిరాజు సాయిబాబురాజు, భూపతిరాజు సతీష్ రాజు, అల్లు సింహాద్రి, నడింపల్లి పండురాజు, ఐఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

కళలు, సాహిత్యంతో అభ్యుదయం

మామిడికుదురు: కళలు, సాహిత్యం ద్వారానే సమాజంలో అభ్యుదయం సాధ్యమవుతుందని ముమ్మిడివరం కళా సాహితి వ్యవస్థాపక అధ్యక్షుడు శినారా పిలుపునిచ్చారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్ సామాజిక భవనంలో ఆదివారం భూపతి వెంకటపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో 'అభ్యుదయ భీమ్ సాహిత్య కళావేదిక'ను ఏర్పాటు చేశారు. డాక్టర్ పొలమూరి విక్రమ్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఈ వేదిక ఏర్పడింది. ఈ సందర్భంగా జరిగిన సభలో శినారా సాహిత్య సంస్థల నిర్వహణలో సాధక బాధకాలను వివరించారు.